కిడ్నీ బాధితులకు ఉచిత డయాలసిస్ సేవలు అమోఘం

- ట్రాన్స్‌పోర్ట్, మెడిసిన్ సైతం ఉచితం
- 'భారతి' ధాతృత్వాన్ని కొనియాడుతున్న కిడ్నీ బాధితులు



కమలాపురంలోని డయాలసిస్ సెంటర్‌లో సేవలు పొందుతున్న రోగులు

కమలాపురం : ప్రస్తుత నేపథ్యంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు నానాటికీ పెరిగిపోతున్నారు. ఆర్థిక సమస్యలున్న వారు డయాలసిస్ చేసుకోవాలంటే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వారానికి ఒకటి, రెండు సార్లు మాత్రమే ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి మూడు సార్లు సైతం డయాలసిస్ చేసుకోవాల్సి వస్తుంది. మూడో సారి డయాలసిస్ చేసుకునే వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) తన సీఎస్ఆర్ నిధులతో కమలాపురంలోని ఆర్‌సీఎం క్యాంపస్‌లో డాక్టర్ రెమిడీస్ హోప్ ఫౌండేషన్ పర్యవేక్షణలో ఉచిత డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసింది. 2019 ఏప్రిల్ 29న పరిశ్రమ ప్రతినిధులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ యూనిట్ నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. సేవలు పూర్తిగా ఉచితం. రోగులకు బస్టాండు నుంచి యూనిట్ వరకు పికప్, డ్రాపింగ్ కోసం ట్రాన్స్‌పోర్ట్ కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందిస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి

కమలాపురంతో పాటు ఎర్రగుంట్ల, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, ఖాజీపేట, వీఎన్‌పల్లె, తాడిపత్రి తదితర ప్రాంతాలకు చెందిన కిడ్నీ బాధితులు కమలాపురంలోని బీసీసీపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డయాలసిస్ సెంటర్‌కు వచ్చి ఉచితంగా సేవలు పొందుతున్నారు. 25 నుంచి 30 మంది వరకు వారానికి 2–3 సార్లు డయాలసిస్ సేవలు పొందుతున్నారు.

రోగుల భద్రతే ధ్యేయంగా డయాలసిస్ సేవలు

రోగుల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఆపరేషన్స్ మేనేజర్ విజయ్‌కుమార్, స్టాఫ్ నర్స్ ఈశ్వరమ్మలు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. డయాలసిస్ ప్రక్రియలో వినియోగించే డై లేజర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 సార్లు వినియోగిస్తారు. కానీ ఇక్కడ మాత్రం ఒక్క సారి మాత్రమే వినియోగిస్తారు. డై లేజర్ ఇలా ఒక్క సారి మాత్రమే వినియోగించడం వలన రోగికి చలి జ్వరం రాదు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటుంది. అందుకోసమే కేవలం ఒక్క సారి మాత్రమే డై లేజర్ వినియోగించి తర్వాత పడేస్తారు.

మెడిసిన్ ఉచితం

ప్రభుత్వ వైద్య శాలల్లో ఆరోగ్య శ్రీ ద్వారా డయాలసిస్ సేవలు ఉచితంగా అందించినప్పటికి ఐరన్, ఈపీఓ ఇంజక్షన్‌లు బయట కొనాల్సి ఉంటుంది. కానీ ఈ డయాలసిస్ సెంటర్‌లో ఐరన్, ఈపీఓతో పాటు హెపారిన్ ఇంజక్షన్లు కూడా ఉచితంగా అందిస్తున్నారు. అలాగే డయాలసిస్ చేసే సమయంలో రోగికి తలనొప్పి, చలి జ్వరం వచ్చే అవకాశాలున్నాయి. అలాంటి సమయంలో కూడా మెడిసిన్ పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు.

రక్త పరీక్షలు ఉచితం

డయాలసిస్ పొందుతున్న రోగులకు ప్రతి 15 రోజులకొక సారి వారికి అవసరమైన రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అలాగే ప్రతి నెలకొక సారి స్క్రీనింగ్ ఉచితంగా చేస్తున్నారు. స్క్రీనింగ్‌లో హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ ఏజీ, హెచ్‌సీవీ తదితర పరీక్షలు చేస్తారు.

ఐదేళ్ల నుంచి వస్తున్నాను



కమలాపురంలో ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నారని తెలుసుకుని ఐదేళ్లుగా వస్తున్నాను. బస్టాండ్ వద్ద దిగి సిబ్బందికి ఫోన్ చేస్తే వారే వచ్చి యూనిట్‌కు తీసుకుని పోతారు. వారానికి మూడు సార్లు డయాలసిస్ సేవలు పొందుతున్నాను. భారతి యాజమాన్యానికి జీవితాంతం రుణపడి ఉంటాను.

–జి.తులసి, డయాలసిస్ పేషెంట్, తాడిపత్రి.

రోగుల ఆరోగ్యమే పరమావధిగా సేవలు అందిస్తున్నాం



ప్రతి రోజు డయాలసిస్ సేవలు అందిస్తున్నాం. రోగుల ఆరోగ్యమే పరమావధిగా సేవలు అందిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 4, మధ్యాహ్నం 4 కేసులు ఉంటాయి. జిల్లా నుంచే కాక తాడిపత్రి తదితర ప్రాంతాల నుంచి సైతం రోగులు వస్తుంటారు. బస్సులకు వచ్చే వారిని బస్టాండు వద్దకు వెళ్లి పికప్ చేసుకుంటాము. డయాలసిస్ చేసిన తర్వాత రోగిని బస్టాండు వద్దకు డ్రాప్ చేస్తాం.

–పి.విజయ్‌కుమార్, ఆపరేషన్స్ మేనేజర్, హియో డయాలసిస్ యూనిట్, కమలాపురం.

దివ్యాంగులకు హెలెన్ కెల్లర్ దిశానిర్దేశం



దివ్యాంగులకు దుస్తులను పంపిణీ చేస్తున్న రూరల్ సీఐ, తదితరులు

పులివెందుల టౌన్ : దివ్యాంగులకు దిశానిర్దేశం చేసిన దార్శనికురాలు హెలెన్ కెల్లర్ అని రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం బధిర వికలాంగుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో డీఎస్పీ మురళీ నాయక్ ఆర్థిక సహకారంతో వికలాంగులకు దుస్తులను పంపిణీ చేశారు. రూరల్ సీఐ ఆవోపా సభ్యులతో కలిసి హెలెన్ కెల్లర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర కార్యదర్శి మేడా సాయిబాబా, పులివెందుల శాఖ అధ్యక్షుడు మేడా దినేష్ గుప్తా, వాసవీక్లబ్ అధ్యక్షుడు రొట్టెల వినోద్ కుమార్, అవోపా కార్యవర్గ సభ్యులు వికలాంగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పులివెందుల టౌన్ : స్థానిక చిన్నరంగాపురం కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మల్లికార్జునరెడ్డి కుమారుడు రుద్రేశ్వర్‌రెడ్డి ఇటీవల కారు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇంటికి వచ్చారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు మల్లికార్జునరెడ్డి ఇంటికి వెళ్లి కుమారుడి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

ఆలయానికి వెండి వస్తువుల బహూకరణ



వెండి వస్తువులను బహూకరిస్తున్న కుటుంబ సభ్యులు

వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యం దేవస్థానంలో ఉన్న సరస్వతీదేవికి వేంపల్లెకు చెందిన పుల్లగూర గోవిందనాథ చటర్జీ ధర్మపత్ని నాగవేణమ్మ వెండి ఆభరణాలు సమర్పించారని ఆలయ వంశపారంపర్య అర్చకులు శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం రూ.లక్ష విలువ చేసే వెండి హస్తాలు, కర్ణాలు, బొట్టు, కళ్ల భక్తుడు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ అర్చకులు శేషగిరిరావు, ఆలయ ప్రతినిధి సాంబశివుడులకు అందజేశారు. వేద మంత్రోచ్చరణలతో శ్రీసరస్వతీదేవికి అభిషేకం, కుంకుమార్చన, అష్టోత్తరా పూజలు చేయించారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భూసార పరీక్ష కేంద్రం ఏడీగా నాగరాజు



ఏడీ నాగరాజు స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

చింతకొమ్మదిన్నె : కడప సంచార భూసార పరీక్ష కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులుగా శుక్రవారం నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషణ చేసి సకాలంలో రైతులకు భూసార పరీక్ష ఫలితాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలి అని రైతులకు సూచించారు. రైతులకు తక్కువ ఖర్చులో అధిక దిగుబడులు సాధించడానికి భూసార పరీక్ష ఫలితాలు ఉపయోగ పడుతాయని తెలిపారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణవేణి



ముద్దనూరు : మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా రాధాకృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి ఇతర సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణవేణికి అభినందనలు తెలిపారు. ఎంపీడీవోగా వున్న ముకుందరెడ్డి స్వచ్ఛంద పదవీ విరమణ చేయడంతో రాధాకృష్ణవేణి విధుల్లో చేరారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శివశంకర్

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎ.శివశంకర్ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఆయన అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తనవంతు సేవలను అందిస్తానన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సన్మానించారు.

అభ కార్డులు, ఎన్‌సీడీలపై రీసర్వే



సర్వే నిర్వహిస్తున్న కడప రిమ్స్ వైద్య బృందం

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గురిజాల గ్రామంలో శుక్రవారం అభ కార్డులు, ఎన్‌సీడీ సర్వేలపై కడప రిమ్స్ వైద్య బృందం రీసర్వే నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభ కార్డులు, ఎన్‌సీడీ సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఆయుష్మాన్ భవ కార్డులను మంజూరు చేశారు. అప్పట్లో జరిగిన సర్వేలు, అందించిన అభ కార్డుదలపై ఇంటింటికి వైద్య బృందం వెళ్లి క్షుణ్ణంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 150 మందికి రీ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందంతోపాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అందరికి అవగాహన ఉండాలి

చింతకొమ్మదిన్నె : సమాజంలోని ప్రతి ఒక్కరికి ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలని, అప్పుడే మనకు మనం కాపాడు కోవడంతో పాటు మనతో ఉన్న వారిని కాపాడగలుగుతామని జిల్లా రెవెన్యూ అధికారి, రెడ్ క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వర నాయుడు తెలిపారు. మండలంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన అయన మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్ గురించి తెలుసుకోవడం ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమన్నారు. అనుకోని ప్రమాదం జరిగితే వారిని గోల్డెన్ అవర్స్‌లో కాపాడి ప్రాణాలను నిలపవచ్చన్నారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ కుమార్, రెడ్ క్రాస్ వాలంటీర్ కిషోర్ కుమార్, పవర్ గ్రిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించండి



జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ రవిబాబు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు కడప రోడ్డులో ఉన్న మెడికల్ కాలేజీ జీజీహెచ్ ఆసుపత్రులను శుక్రవారం అడిషనల్ డీఎంహెచ్ఓ రవిబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ సౌజన్యలతో టీబీ, హెచ్ఐవీ, ఎయిడ్స్, లెప్రసీ సంబంధిత వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ ప్రచార కార్యక్రమం గురించి చర్చించారు. అలాగే టీబీ యూనిట్, లెప్రసీ యూనిట్, హెచ్ఐవీ/ఎయిడ్స్ సురక్ష కేంద్రాల కేంద్రాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం భాకరాపురంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారు జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సతీష్ కుమార్, డిప్యూటీ పారా మెడికలాఫీసర్ సుబ్బారెడ్డి, సిబ్బంది భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బలిజలపై అరాచకాలకు పాల్పడితే ఉద్యమిస్తాం

– రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డి శేఖర్



మీడియాతో మాట్లాడుతున్న రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రెడ్డి శేఖర్

పులివెందుల టౌన్ : రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా బలిజ కులస్తులపై దాడులకు, అన్యాయాలకు, అక్రమాలకు, ఆరాచకాలకు పాల్పడితే ఉద్యమిస్తామని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ రాయల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక గుంతబజార్‌లో ఉన్న శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకముందు బలిజ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీపతి బాలుడు కుటుంబ సభ్యులను ఆయన వారి స్వగృహంలో కలిసి భూమి కబ్జా వివరాలను, జరిగిన సంఘటనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డిశేఖర్ రాయల్ మాట్లాడుతూ పులివెందులకు చెందిన శ్రీపతి బాలుడు, శ్రీపతి చక్రవర్తి కుటుంబ సభ్యులకు చెందిన రిజిస్టర్ భూమిని అధికార పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై దొంగ రిజిస్టర్లు చేసుకుని భూకబ్జాకు పాల్పడటం చాలా దారుణమైన విషయమన్నారు. గతంలో శ్రీపతి బాలుడు ఆయన సతీమణి పేరుతో రిజిస్టర్ అయి ఉన్న ప్లాటును పులివెందుల పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఎలా కబ్జా చేస్తారని, ఏ విధంగా తిరిగి ఆ నాయకుని కుటుంబ సభ్యుల పేరు మీద రిజిస్టర్ చేస్తారని ఆయన ప్రశ్నించారు. పులివెందులలోని శ్రీపతి బాలుడు కుటుంబ సభ్యులపై ఎవరైనా దాడులకు, అక్రమాలకు, అన్యాయాలకు, అరాచకాలకు పాల్పడితే తప్పకుండా వాటిని సంఘటితంగా ఎదుర్కోవడానికి పోరాడుతామన్నారు. అనంతరం ఆయన స్థానిక గుంతబజార్‌లో బలిజ సంఘం నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పులివెందుల శ్రీపతి బాలుడికి జరిగిన అన్యాయంపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, ఏమి చేపట్టాలన్న విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకుడు వెంకటరమణ, ఆర్పీఎఫ్ పొలిటికల్ సెల్ కన్వీనర్ జె.ఎస్.బాబు రాయల్, పులివెందుల బలిజ సంఘ అధ్యక్షుడు గూడూరు ప్రసాద్, కార్యదర్శి ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు యార్వ వెంకటసుబ్బయ్య, బలిజ సంఘం నేతలు కడియాల లక్ష్మీనారాయణ, తోటంశెట్టి హరి, మాజీ కౌన్సిలర్ కొంగనపల్లె రవి, అల్లం రంగనాయకులు రాయల్, అంబకపల్లె బాబు, బ్యాటరీ ప్రసాద్, సర్వేశ్వరుడు, శ్రీపతి పెద్ద బాలుడు, పోలిశెట్టి కృష్ణమూర్తి, వెంకటనారాయణ, మందాల కార్తీక్, రఘునాథ్, ఆలవపాడు శ్రీరాములు, ఆర్పీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీపతి శ్రీనివాసులు, శ్రీపతి చక్రవర్తి, పలువురు బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ గంగాధర్‌కు డాక్టరేట్

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న బాల్కొండ గంగాధర్ డాక్టరేట్ పొందడంతో తోటి అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. చరిత్ర అధ్యాపకుడు, ప్రముఖ రచయిత బాల్కొండ గంగాధర్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ నాగేంద్ర ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొని అభినందనలు తెలిపారు.

తాగునీటి పథకాలకు రూ.18 కోట్లతో ప్రతిపాదనలు



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, తదితరులు

వేంపల్లె : జిల్లాలో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు (సీపీడబ్ల్యూఎస్) సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలకు రూ.18 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జెడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. శుక్రవారం వేంపల్లెలో పారిశుద్ధ్యం పనులపై జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులతో కలిసి జెడ్పీ సీఈవో తనిఖీ చేశారు. అలాగే జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలను తనిఖీ చేసి తాగునీరు, ఇతర సమస్యలపై పాఠశాల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీకి చెందిన వాణిజ్య సముదాయ గదులను పరిశీలించారు. బాడుగలు చెల్లించని దుకాణదారులు బకాయిలను చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జెడ్పీ చెందిన వాణిజ్య సముదాయాల నుంచి రూ.10 లక్షల మొండి బకాయిలు రావాల్సి ఉందన్నారు. అందులో వేంపల్లెలో జెడ్పీ సముదాయ గదుల నుంచి రూ.2లక్షలు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే దుకాణాదారులకు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇచ్చామని, 10 రోజుల్లోగా బకాయిలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 12 ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. వేంపల్లెలో పారిశుద్ధ్యం చాలా అధ్వానంగా ఉందని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డిని ఆదేశించారు. అలాగే జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలలో నాడు–నేడు కింద అసంపూర్తిగా ఉన్న తరగతి భవనాలను ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కూడా కలిస్తామన్నారు. ఆదాయం పెంచేందుకు జెడ్పీ వాణిజ్య గదులపై నూతన గదుల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వాణిజ్య గదుల్లో ఉన్న దుకాణదారుల కోసం బాత్‌రూంలు కూడా నిర్మిస్తామన్నారు. వేంపల్లెలోని జెడ్పీ గదుల వెనుక వైపు అపరిశుభ్రత ఉండకుండా ఉండేందుకు మాంసం మార్కెట్ షెడ్లను ఏర్పాటు చేస్తామని, ఈ మేరకు త్వరితగతిన అంచనా వేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వంట గది నిర్మాణం చేపట్టాలని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేశారు. దీంతో వంట గది నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం బక్కన్నగారిపల్లెలోని పారిశుధ్య పనులను తనిఖీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఎంపీడీఓ కుళాయమ్మ, పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి, ఏఓ గంగిరెడ్డి, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, హెడ్మాస్టర్లు నాగాంజనేయులు, శివమునెమ్మలతోపాటు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి

పెండ్లిమర్రి : ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి కృష్ణసుమంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరు, నందిమండలం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టాక్ రిజిస్టర్లును పరిశీలించి ఎరువుల గొడలను తనిఖీ చేశారు. ఎరువులు విక్రయించిన ప్రతి రైతుకు బిల్లు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. అలాగే నందిమండలం–1, 2 రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియా 40 టన్నులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకాల్లో బకెట్లు పెట్టకుండా చూడాలి

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యం తూకాల్లో డీలర్లు బకెట్లు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కో కన్వీనర్ దాదా పీర్‌లు కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రేషన్ బియ్యం పంపిణీపై వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా వేంపల్లెలో రేషన్ బియ్యం పంపిణీ చేసే డీలర్లు పేదల బియ్యంలో కూడా కోతలు విధిస్తున్నారన్నారు. డీలర్లు తూకాలు వేసే సమయంలో ప్లాస్టిక్ బకెట్లలో బియ్యం వేసి తూకాలు వేయడం వలన 25 కేజీల బియ్యానికి 22 కేజీల బియ్యం మాత్రమే పేదలకు అందుతోందన్నారు. ప్రజలు తీసుకెళ్లిన సంచుల్లోనే బియ్యం వేసి తూకాలు వేసే విధంగా డీలర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఆయిల్ ఫాం సాగులో ఆదాయమే



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర

వేముల : ఆయిల్ ఫాం సాగు రైతులకు లాభదాయకమేనని, సాగు చేసుకున్న రైతులకు ఉద్యాన శాఖ ద్వారా అన్ని రకాలుగా ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఉద్యాన శాఖ, ఎంకే ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగును ఎంపిక చేసుకున్న రైతులకు ఉద్యాన శాఖ ద్వారా హెక్టార్‌కు మొక్కలు నాటుకునేందుకు రూ.29వేలు, నాలుగేళ్లపాటు మొక్కల నిర్వహణకు రూ.5,250లు, అలాగే ఏడాదికి అంతర పంటలు సాగు చేసుకున్న రైతులకు ఏడాదికి రూ.5,250లు సబ్సిడీ ఇస్తారన్నారు. లింగాల, పులివెందుల, వేముల మండలాలు ఆయిల్ ఫాం సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ మండలాల్లో ఎంకే ఆగ్రోటెక్ లింగాల, వేముల మండలాలకు, సుపేన్ ఆగ్రోటెక్ పులివెందుల మండలానికి ఆయిల్ ఫాం మొక్కలు సరఫరా చేస్తారన్నారు. ఈ మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఆయిల్ ఫాం సాగుకు మన ప్రాంతం అనుకూలంగా ఉంటుందని, ఎటువంటి సందేహం లేకుండా రైతులు ఆయిల్ ఫాం సాగుకు ముందుకు రావాలని సూచించారు. పొలాల్లో 9 గీ9 దూరంలో మొక్కలు నాటుకోవాలన్నారు. నూనె ఇచ్చిన పంటలను ప్రోత్సహించడమే ఆయిల్ ఫాం సాగు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం వ్యవసాయ తోటలో ఆయిల్ ఫాం మొక్కలు నాటి ఆయిల్ ఫాం సాగును ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి రాఘవేంద్రారెడ్డి, ఆగ్రోటెక్ కంపెనీ ప్రతినిధి రాజేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

వేంపల్లె : మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. శుక్రవారం వేంపల్లెలోని 1వ సచివాలయం పరిధిలో ఫ్రై డే – డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా లార్వా సర్వే నిర్వహించి, మురికి కాలువల్లో నిలిచిన నీటి నిల్వలను తొలగించి పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వృద్ధిని నివారించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలతోపాటు ప్రతి శుక్రవారం లార్వా నిర్మూలన కొరకు ఫ్రైడే–డ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగీ, ఫైలేరియాసిస్, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులు వస్తాయని, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

పులివెందుల రూరల్ : ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచించారు. శుక్రవారం పులివెందుల సబ్‌జైలులో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను అయన సందర్శించి రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేస్తూ జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. అనంతరం అయన ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించడం జరిగిందని, ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలను సంప్రదించాలన్నారు. సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానెల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరిస్తే అక్రమ కేసులు ఉండేవి కావు

- మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- సాధారణ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్





సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : మున్సిపల్ కమిషనర్, అధికారులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే నాపై, కౌన్సిలర్లపై అక్రమ కేసులు ఉండేవి కావని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ రాముడు అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ హాజరై మాట్లాడుతూ గతనెల 25వ తేదీన మున్సిపల్ కమిషనర్ రాముడు, డీఎస్పీ మురళీనాయక్‌లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహాల చుట్టూ కట్టిన టీడీపీ జెండాలు, తోరణాలు తొలగించాలని చెప్పామన్నారు. సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోగా కమిషనర్ మహానాడులో ఉన్నానని సీఐకి తెలపాలని, సీఐకి తెలిపితే ఆయన కమిషనర్ మీద చెప్పి రెస్పాండ్ కాకపోవడంతో అందుకు తామే టీడీపీ తోరణాలను మాత్రమే తొలగించామని, ఇదంతా ఒక కానిస్టేబుల్ సాక్ష్యంగా ఉన్నారన్నారు. కానిస్టేబుల్ వీడియో కూడా తీశారన్నారు. మాపై అక్రమ కేసు బనాయించి మరుసటి రోజు రాత్రి 12 గంటలకు వేముల పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలర్లను కులాల పేరుతో దూషించి గొడ్డును బాదినట్టు చిత్రహింసలకు గురిచేశారన్నారు. బట్టలు ఊడదీసి ఫొటోలు తీసి ఈ విధంగా నాకు తెలిసి కౌన్సిలర్లపై పోలీసులు ఇలా చేసి ఉండరన్నారు. వేముల పోలీస్‌స్టేషన్ నుండి ఎడమ వైపు వాహనంలో తీసుకెళ్లడంపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందించడంతో కౌన్సిలర్లను జమ్మలమడుగు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా జరిగిన విషయాన్ని వివరించడం జరిగిందన్నారు. దీంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి ఎలాంటి గాయాలు లేవని స్టేట్‌మెంట్ తీసుకోవడం జరిగిందన్నారు. కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ అక్రమ కేసుపై హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఆ రిపోర్ట్ రావాల్సి ఉందన్నారు. మమ్ములను 22 రోజులపాటు సబ్‌జైలులో అక్రమంగా పెట్టారన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదన్నారు. రౌడీలను చూసినట్లు చూడటం చాలా బాధాకరమన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ తీర్మానించడం జరిగిందన్నారు. ఎటువంటి ఆయుధాలు లేకపోయినా నాతోపాటు మరో 15 మందిపై అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. దీనిపై అధికారులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే అక్రమ కేసులు ఉండేవి కాదన్నారు. అదేవిధంగా 10 రోజుల క్రితం రింగ్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి మైనర్ బాలురు పాలాభిషేకం చేసి శుభ్రం చేస్తుంటే వారిపై కూడా విచక్షణారహితంగా అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికి కూడా మున్సిపల్ అధికారులు పట్టణంలో అక్కడక్కడా టీడీపీ కటౌట్లు అడ్డుగా ఉన్నా వాటిని ఇంతవరకు తొలగించలేదన్నారు. అదే మన పార్టీ జెండాలు ఏవి ఉన్నా మూడు రోజుల్లో శ్రద్ధగా తీసేస్తున్నారన్నారు. అధికారులందరూ, పోలీసులు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి అక్రమ కేసులు ఉండవన్నారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి

మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణమే స్పందించాలని మున్సిపల్ చైర్మన్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాలలో యూజీడీ అస్థవ్యస్థంగా ఉందని, కొన్ని ప్రాంతాలలో వీధిలైట్లు లేవన్నారు. ఆయా అందుకు ఆయా వార్డులలోని కౌన్సిలర్లు సమస్యలను సభలో లేవనెత్తారు. వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులు కౌన్సిలర్లకు తెలియకుండా అనుబంధ ఫారాలు ఇవ్వకూడదని తహసీల్దార్ నజీర్ అహ్మద్‌ను తెలియజేశారు. కాలనీలలో ఇంటి నెంబర్లు లేని ఇళ్లకు ఇంటి పన్నులు కడుతున్నారని, వాటికి డిక్లరేషన్ పత్రాలు రెవెన్యూ అధికారులు ఇస్తే ఇంటి నెంబర్లను ఇచ్చేందుకు వీలుంటుందన్నారు. దీనికి తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో హౌసింగ్, మెప్మా, రెవెన్యూ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.